క్లుప్తంగా

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట



వెంకటాపురం(ఎం) : వర్షాలు కురవాలని కోరుతూ మండల కేంద్రంలో యువకులు శనివారం కప్పతల్లి ఆట ఆడారు. డప్పు చప్పుళ్లతో గ్రామంలోని అన్ని వీధుల్లో తిరుగుతూ కప్పతల్లి ఆట ఆడగా మహిళలు బిందెలతో నీళ్లు పోశారు. వర్షాలు కురవాలని, పంటలు పండాలని ఆకాంక్షించారు.

ఒకరిపై కేసు

కన్నాయిగూడెం : మండలంలోని ముప్పనపల్లి గ్రామంలో గిరిజన కోఆపరేటివ్ సెంటర్ (జీసీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో జరిగిన నిధుల అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జీసీసీ ఆధ్వర్యంలోని పెట్రోల్ పంప్‌లో సేల్స్‌మెన్ లచ్చుబాబుతోపాటు కొందరు ఆపరేటర్లు పని చేస్తున్నారు. కాగా రెడ్డి ప్రశాంత్ అనే ఆపరేటర్ నిధుల అక్రమాలకు పాల్పడ్డట్టు సేల్స్‌మెన్ లచ్చుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రెడ్డి ప్రశాంత్‌పై కేసు నమోదు చేశారు.

'బొలెరో' బోల్తా.. దంపతులకు గాయాలు



వాజేడు : బొలేరో వాహనం బోల్తా పడిన ఘటనలో దంపతులకు గాయాలైన ఘటన మండలంలోని చెరుకూరు, కడేకల్ గ్రామాల నడుమ శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన బోదెబోయిన రామకళ–శివాజీ దంపతులు కొద్ది రోజులుగా ఏటూర్‌నాగారంలో నివాసం ఉంటున్నారు. వీరు అక్కడి నుంచి వారి స్వగ్రామమైన కృష్ణాపురం గ్రామానికి సామాన్లతో బొలేరో వాహనంలో వెళ్తుండగా అది అదుపు తప్పి రోడ్డు కింద లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో శివాజీ, రామకల గాయాల పాలయ్యారు. వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి ఏటూర్‌నాగారంలోని సివిల్ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గ్రామ మాజీ సర్పంచ్ గద్దల అశాలు మృతి చెందగా ఆయన మృతదేహానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు పార్టీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని వెంకన్న, రఘు పరామర్శించి రూ.10 వేలు అందించారు. ఆశాలు మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, నర్సింగరావు, చెన్నూరి బాలరాజు, చిన్న ఎల్లయ్య, ముక్కెర లాలయ్య, రియాజ్, గౌస్, సులేమాన్, శ్రీనివాస్, నవీన్, లక్కి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

భూపాలపల్లి రూరల్: మండలంలోని వజినపల్లి గ్రామానికి చెందిన గండి రాజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మృతుడి మిత్రులు తమ వంతు సాయంగా అదే గ్రామానికి చెందిన చైతన్య యూత్ ఆధ్వర్యంలో రూ.5,000లను శనివారం ఆర్థిక సాయంగా అందజేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్, డీఎంహెచ్‌ఓ అప్పయ్యతో వైద్యాధికారులు

ములుగు : బీఆర్‌ఎస్ ప్రభుత్వ చొరవతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. డాక్టర్స్ డే పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు మరింత మెరుగయ్యాయని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నార్మల్ డెలివరీలకు అవకాశం ఎక్కువగా ఉంటోందన్నారు. ప్రసవం కోసం పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు జిల్లా ఆస్పత్రికి పంపించాలని సిబ్బందికి తెలిపారు. ముహూర్తపు ప్రసవాలు అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను గణనీయంగా పెంచాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపైనా ఉందన్నారు. సాధారణ ప్రసవాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ముందువరుసలో నిలపాలని కోరారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారులకు డీఎంహెచ్‌ఓ అప్పయ్య ప్రశంసా పత్రాలు అందించి శాలువాలతో సన్మానించారు. తదనంతరం డాక్టర్ అప్పయ్య మాట్లాడారు. వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని చెప్పారు. జిల్లాలో గిరిజన గ్రామాల్లో వైద్యాధికారులు మరింత శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. సమావేశంలో సివిల్ సర్జన్లు రఘు, ప్రవీణ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు పోరిక రవీందర్, ఎం.వెంకటేశ్వరరావు, పవన్ కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు దుర్గారావు, సంపత్ రావు, హెచ్.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో గొల్లపెల్లి రాజేందర్, తదితరులు



డాక్టర్ అమూల్యను సన్మానిస్తున్న సర్పంచ్

వైద్యులకు ఘన సన్మానం

స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, ఇతర డాక్టర్లను కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. దేవుడు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారని కొనియాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధక్షుడు వంగ రవి యాదవ్, మత్స్య సెల్ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, కిసాన్ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్, జిల్లా నాయకులు శంకర్, రేవంత్‌యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, మర్రి రాజు, బోడ రఘు, రాజు, అనిల్, సుధాకర్ పాల్గొన్నారు.

జాకారంలో..

గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పల్లె దవాఖాన వైద్యురాలు అమూల్యను సర్పంచ్ దాసరి రమేశ్ శాలువాతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. వైద్యులు దేవుళ్లతో సమానమని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దేవేందర్, హెల్త్ అసిస్టెంట్ భూక్య వెంకన్న, ఏఎన్‌ఎంలు పోరిక తిరుమల, సుజాత, ఆశా కార్యకర్తలు మల్లిక, రజిత, కారోబార్ రఘు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి అల్లి నరేశ్



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నరేశ్

మంగపేట : వర్షాకాలం మొదలైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ అల్లి నరేశ్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో పలువురికి ఆయన శనివారం వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజలు వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా కాపాడుకునేందుకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ప్రధానంగా వైరల్ ఫీవర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిల్వ ఉన్న ఆహారాన్ని భుజించవద్దని, కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని స్పష్టం చేశారు. దోమల ద్వారా ప్రబలే మలేరియా, డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు దోమలు వృద్ధిని అరికట్టే ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. జనావాసాలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. వర్షపు నీరు, జనావాసాల నుంచి వెలువడే మురుగు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పీహెచ్‌సీలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేసే సదుపాయం ఉన్నట్టు తెలియక ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను, ల్యాబ్‌లను ఆశ్రయించి నష్టపోతున్నారని తెలిపారు. పీహెచ్‌సీలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, సిబ్బంది ఉన్నారని చెప్పారు. ఆత్యాధునిక పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తూ నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని వివరించారు. మలేరియా, డెంగ్యూ, రక్త పరీక్షలతోపాటు బ్లెడ్ సెల్స్ కౌంట్ పరీక్ష కోసం స్థానిక పీహెచ్‌సీలో సంప్రదించాలని ప్రజలను కోరారు. తద్వారా ఉచితంగా మెరుగైన వైద్య సేవలు పొందాలని చెప్పారు.

సీఐ దాతృత్వం.. గర్భిణికి రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఐ రాజు



సీఐ రాజును సన్మానిస్తున్న గ్రూపు సభ్యులు

ఏటూరునాగారం : ఓ గర్భిణి కోసం స్థానిక సీఐ మండల రాజు రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. దీంతో ఏటూరునాగారం బ్లడ్ గ్రూప్ సభ్యులు ఆయనన్ను జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన గర్భిణికి 'ఏ' పాజిటివ్ గ్రూప్ రక్తం అవసరం ఉండడంతో ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ గ్రూపులో శనివారం పోస్ట్ పెట్టారు. దీనికి స్థానిక సీఐ మండల రాజు వెంటనే స్పందించారు. తక్షణమే ఆస్పత్రికి వెళ్లి రక్తం అందజేశారు. బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యులు సన్మానించిన సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎవరికి రక్తం అవసరమున్నా బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యులు సమకూరుస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యులను అభినందించారు. యువత సామాజిక సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ గ్రూప్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్, పెండ్యాల ప్రభాకర్, సర్వేశ్వర్ రావు, మెరుగు హరీశ్, ఎర్రమనేని సతీశ్, వద్ది నరేశ్, తడక సుమన్, బందారు లక్కి, గండపల్లి సుకేశ్, నారా ప్రశాంత్, గయాజ్, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలే ధ్యేయం



జెండా వందనం చేస్తున్న డైరెక్టర్లు, సిబ్బంది

ఏటూరునాగారం : రైతులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ముందుకు సాగుతోందని సీనియర్ డైరెక్టర్ మాదరి రామయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో అంతర్జాతీయ సహకార దినోత్సవాలను పాలకమండలి సభ్యులు శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను రామయ్య ఆవిష్కరించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి సంఘం పాటుపడుతోందని చెప్పారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ గౌరీ, డైరెక్టర్లు అబ్బు బుచ్చయ్య, వంగపండ్ల రవి, బాస లక్ష్మి, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు 4న ఎంపిక

ఎస్ఎస్ తాడ్వాయి : రాష్ట్రంలోని వివిధ స్పోర్ట్స్ స్కూళ్లలో 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈనెల 4న మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంఈఓ సాంబయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి 2014 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు 31 మధ్య, 5వ తరగతిలో ప్రవేశానికి 2013 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే పోటీలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9490108285లో సంప్రదించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలి

ఏటూరునాగారం : 2021 జూన్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనుల వివరాలు, రూ.12 కోట్ల ఖర్చును ప్రజలకు తెలిపేలా చేపట్టిన సోషల్ ఆడిటింగ్‌కు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30 నుంచి ఈనెల 6 వరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై ఆడిటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని చెల్పాక, శంకరాజుపల్లి, షాపెల్లి, అల్లంవారి ఘణపురం, కోయగూడ ఎల్లాపురం, శివాపురం గ్రామాల్లో ఈనెల 5న సభలు నిర్వహించి అవినీతి, అక్రమాల వివరాలతోపాటు అవకతవకలను గుర్తించనున్నట్టు తెలిపారు. అలాగే ఈనెల 6న ముల్లకట్ట, కొండాయి, రామన్నగూడెం, రొయ్యూర్, చిన్నబోయినపల్లి, ఏటూరునాగారం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద సభలు నిర్వహించి చేపట్టిన పనులు, జరిగిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడిస్తారని వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించి మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, ఖర్చు ఇతర వివరాలు వెల్లడిస్తారని తెలిపారు.

రజకులకు ధోబీ సేవలు ఇవ్వడంపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న రజక సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ సంస్థల్లో ధోబీ సేవలను రజక సొసైటీలకు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు జిల్లాలోని రజకులు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద సీఎం కేసీఆర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీసీలకు ఇస్తున్న రూ.లక్ష రుణం పథకంలో చాకలి కులస్తులను కూడా చేర్చడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర నాయకుడు పైడిపల్లి రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, రజక సంఘం అర్బన్ నాయకులు గోపరాజు రాజు, పైండ్ల రఘు, నాంపల్లి కుమార్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, సమ్మయ్య, వీరస్వామి, నడిగట్టు సమ్మయ్య, నిమ్మల కుమార్, బోనాల శంకర్, భువనగిరి ప్రశాంత్ రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రమాద బీమా



గ్రామస్తులతో బీమా చేయిస్తున్న నరేశ్

మల్హర్: మండలంలోని వల్లెకుంటలో గ్రామ పంచాయతీ కార్మికులకు, గ్రామస్తులకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి నరేశ్ తెలిపారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీమా క్యాంపులో భాగంగా 18 నుంచి 65 సంవత్సరాల కలిగిన వారికి రూ.396తో రూ.10 లక్షల ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేసినట్లు నరేష్ వెల్లడించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వట్లేదని ఆందోళన



రేషన్‌కార్డులతో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

కాటారం: ప్రభుత్వం ద్వారా అందాల్సిన రేషన్ బియ్యం డీలర్ నిర్లక్ష్యంతో మూడు నెలలుగా రావడం లేదని మండలంలోని శంకరాంపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఎదుట శనివారం రేషన్‌కార్డులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. రేషన్ డీలర్ సమయానుకూలంగా బియ్యం పంపిణీ చేయడం లేదని, నెలలో ఒకటి రెండు రోజులు రేషన్ దుకాణం ఓపెన్ చేసి కొంత మందికే బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. సగానికి పైగా లబ్ధిదారులకు ప్రతీ నెల బియ్యం అందడం లేదని తెలిపారు. బియ్యం ఇవ్వాలని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని, పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అందక బియ్యం కొనే ఆర్థిక పరిస్థితి లేక పస్తులు ఉండాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు ప్రతి నెల రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అంగజాల అశోక్, ఉపసర్పంచ్ రమ్యశ్రీ, లబ్ధిదారులు కోరారు.

రామాలయ అభివృద్ధికి కృషి



సంపత్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

టేకుమట్ల: ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా అని రామాలయం ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా సలిగంటి సంపత్ అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లిలోని రామాలయం ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా సలిగంటి సంపత్ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. దీంతో చైర్మన్‌ను శనివారం స్థానిక రామాయలంలో కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పుప్పాల రాజు, మాజీ సర్పంచ్ సోరుపాక సదయ్య, కమిటీ సభ్యులు గోపగాని సదయ్య, దిలీప్‌రెడ్డి, నరేందర్, శ్రీధర్, సంపత్, నర్సింగరావు, శ్రీధర్‌రెడ్డి, వీరస్వామి, ప్రశాంత్, లచ్చిరెడ్డి, రాజశేఖర్, కోటి, శ్యాంసుందర్ రెడ్డి, నర్సయ్య, నల్లబెల్లి రవీందర్, కిరణ్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



అరెస్టు చూపుతున్న ఎస్సై షాఖాన్

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి శివారులో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షాఖాన్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పాశిగడ్డతండా గ్రామానికి చెందిన లావ్యుడ సమ్మయ్య అక్రమంగా గుడంబాను తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరుపల్లి శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గుడుంబాను అమ్మిన, తయారు చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పేదలను ఆదుకునేలా సీఎంఆర్‌ఎఫ్

చిట్యాల: సీఎం కేసీఆర్ పేదలను ఆదుకునేలా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు జెడ్పీటీసీ గొర్రె సాగర్ తెలిపారు. మండలంలోని దూద్‌పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు శనివారం ఆయన ఇంటికి వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని చెప్పారు. పేదలకు ఆర్థిక భారం కాకుండా వైద్యానికి అయ్యే ఖర్చులను కొంత మేరకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందిస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ మడికొండ రవీందర్‌రావు, సర్పంచ్ పులి వెంకటేష్, నాయకులు కత్తి సతీష్, రాజగోపాల్, కృష్ణ, వైకుంఠం, రాంచందర్, సురేష్, గుండ రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



టేకుమట్ల : పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న అఫ్జల్



చిట్యాల : బుక్స్ అందజేస్తున్న సర్పంచ్, ఫౌండేషన్ సభ్యులు

చిట్యాల: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఫౌండేషన్ అధ్యక్షుడు నిమ్మల దశరథం అన్నారు. మండలంలోని వరికోల్‌పల్లి గ్రామ శివారు కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు ఫ్రేమ్స్ ఫౌండేషన్ భూపాలపల్లి వారి ఆధ్వర్యంలో శనివారం నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నిమ్మల దశరథం మాట్లాడుతూ.. జిల్లాకు దూరంగా ఉన్న మారుమూల ప్రాంత గ్రామాలను, ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థుల కోసం తమ వంతుగా అన్ని రకాల సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండెం సాంబయ్య, ఉపాధ్యాయులు అశోక్, ఫౌండేషన్ సభ్యులు క్యాతం అనిల్ కుమార్, దేవేందర్, రాజు, సౌజన్య, కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాలకు చెందిన శివతేజస్విని, శివకుమార్ అనే విద్యార్థులు ఇటీవల మండల స్థాయిలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీలో ప్రతిభ కనబర్చారు. అలాగే మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రాథమిక పాఠశాలకు చెందిన శివకుమార్ అల్లూరి సీతారామరాజుగా ఏకపాత్రాభినయం చేసి అలరించారు. దీంతో ఈ విద్యార్థులను పాఠశాల పూర్వ విద్యార్థి మహ్మద్ అఫ్జల్ శనివారం స్థానిక పాఠశాలలో సన్మానించి పరీక్ష ప్యాడ్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బిట్ల వేణు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రకాశ్, వరప్రసాద్, సతీశ్, జ్యోతి, రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్లు చిలుక రవీందర్, గోక ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్ష ప్రశాంతం

కాటారం: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో శనివారం గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, ఆదర్శ పాఠశాల, గంగారం మోడల్ పాఠశాల, కొత్తపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో అభ్యర్థులు ఉదయం, సాయంత్రం పరీక్షలు రాశారు. ఉదయం పరీక్షకు 738, మధ్యాహ్నం 734 మంది హాజరైనట్లు తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి తెలిపారు. గంగారం మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద పలు కారణాలతో ఇద్దరు అభ్యర్థులను అధికారులు పరీక్షకు అనుమతించలేదు. మహాముత్తారం మండలానికి చెందిన శారద పరీక్షకు మూడు నిమిషాలు ఆలస్యంగా రాగా భూపాలపల్లికి చెందిన రచన ఐడీ ప్రూఫ్ కోసం వెళ్లి ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో రచన అక్కడ డ్యూటీలో ఉన్న అధికారులు, సిబ్బందితో వాగ్వివాదానికి దిగింది. ఆమెకు పోలీసులు నచ్చజెప్పి ఇంటికి పంపించారు.